

టన్ను చీనీ రూ.19 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టన్ను చీనీ కాయలు గరిష్టంగా రూ.19 వేలు పలికినట్లు అధికారులు తెలిపారు.



టమాట కిలో రూ.12
కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాటా గరిష్ట ధర రూ.12 ప్రకారం పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

రైతన్నకు భరోసా

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు వేసే ప్రతి అడుగులోనూ తోడుగా ఉంటున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు అందజేయడమే కాకుండా పంటలకు మార్కెటింగ్ సౌకర్యం సైతం కల్పిస్తున్నారు. ముఖ్యంగా పెట్టుబడుల కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించకుండా వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 అందిస్తున్నారు. ఇప్పటికే నాలుగు విడతల సొమ్ము అందజేయగా బుధవారం ఐదో విడత సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

- రేపు వైఎస్సార్ రైతు భరోసా, సున్నావడ్డీ జమ
- ఐదో ఏటా నిధులు అందజేస్తున్న జగన్ సర్కార్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు





రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు

పుట్టపర్తి అర్బన్: ఇచ్చిన మాటకు కట్టుబడి రైతన్నలకు అండగా నిలుస్తున్నారు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. అందులో భాగంగా పంట సాగుకు రైతులు ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' పథకాన్ని ఏటా అమలు చేస్తున్నారు. తాజాగా ఐదో ఏడాది నిధులను ఈనెల 28న విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. రూ.2 వేల ప్రకారం రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. దీంతో పాటు వైఎస్సార్ పంట రుణాల సున్నావడ్డీ కింద 2022 ఖరీఫ్, రబీలో రూ. లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులకు వడ్డీ జమ చేయనున్నట్లు తెలిపారు.

అర్హత గల ప్రతి రైతు ఖాతాలో జమ

ఎన్నికల హామీల్లో భాగంగా అప్పట్లో వైఎస్సార్ రైతు భరోసా రూ.12,500 అందజేస్తానని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. అయితే అధికారంలోకి వచ్చాక మరో రూ.1,000 పెంచి ఏటా రూ.13,500 అందజేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో గత జూన్‌లో ఖరీఫ్ కింద ఒక్కో రైతుకు రూ.7,500, అక్టోబర్‌లో రబీకి రూ.4 వేల ప్రకారం జమ చేయగా... తాజాగా తుది విడతగా రూ.2 వేల ప్రకారం ఇవ్వనున్నారు. మొత్తంగా ఏటా రూ.13,500 ప్రకారం పెట్టుబడి సాయం అందనుంది.

జిల్లాలో 2,79,580 మంది అర్హులు

'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' పథకానికి సంబంధించి జిల్లాలో 2,79,580 మంది అర్హులున్నారు. ఇందులో భూ యజమానులు 2,78,898 మంది ఉండగా, దేవదాయ, అటవీ భూములు సాగు చేసుకుంటున్న వారు మరో 17 మంది ఉన్నారు. ఇక భూమి లేని నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సాగుదారులు 665 మంది ఉన్నారు. వీరందరికీ రూ.2 వేల చొప్పున రూ.55,94,47,500 నగదు ఖాతాల్లో జమ చేయనున్నారు.

క్రమం తప్పకుండా సున్నావడ్డీ

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి అర్హులైన రైతులకు క్రమం తప్పకుండా సున్నా వడ్డీ అందజేస్తున్నారు. 2022 ఖరీఫ్, రబీలో రూ. లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు జిల్లాలో 1,00,843 మంది ఉండగా, వారు తీసుకున్న రుణం మొత్తం రూ.584.14 కోట్లుగా ఉంది. వీరందరికీ సున్నా వడ్డీ కింద రూ.21,52,69,741 మొత్తాన్ని జమ చేయనున్నారు. దీంతో జిల్లాలో రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ కింద రూ.77,47,17,241 లబ్ధి కలగనుంది. ఈనెల 28వ తేదీ (బుధవారం) సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్‌లో బటన్ నొక్కి నిధులు విడుదల చేయనున్నారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు, ప్రజాప్రతినిధులతో కలిసి అర్హులైన రైతులకు మెగా చెక్కు అందజేయనున్నారు.

1,00,843
సున్నా వడ్డీ లబ్ధిదారుల సంఖ్య

రూ.21.52 కోట్లు
సున్నా వడ్డీ కింద రైతులకు లబ్ధి

2.79 లక్షల మంది
రైతు భరోసా లబ్ధిదారులు

రూ.55.94 కోట్లు
రైతు భరోసా కింద లబ్ధి

చాలా సంతోషంగా ఉంది



ఎన్ని ఇబ్బందులున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రైతు భరోసా కింద ఇప్పటికే నాలుగు విడతల మొత్తం ఖాతాల్లో జమ చేశారు. బుధవారం మరోసారి వైఎస్సార్ రైతు భరోసా నిధులు జమ చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. రైతుకు ఇంత కంటే ఇంకేం కావాలి. – సూర్యనారాయణరెడ్డి, రైతు, జగరాజుపల్లి

వడ్డీల బాధ తప్పింది



పంటల సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం గతంలో ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేయాల్సి వచ్చేంది. దిగుబడి ఎంత వచ్చినా వడ్డీలకే సరిపోయేది. కానీ ఇప్పుడు అలా కాదు. పెట్టుబడికి ప్రభుత్వమే డబ్బులిస్తుండటంతో మా రెక్కల కష్టం మాకే దక్కుతోంది. వడ్డీల బాధ తప్పింది. ఈ ఐదేళ్లలో నాకు రూ.67,500 లబ్ధి కలుగుతోంది. – చంద్రాయుడు, రైతు, సుబ్బరాయనిపల్లి

జిల్లాకు రూ.77.47 కోట్లు



ఈ విడత రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంలో భాగంగా జిల్లాలోని రైతుల ఖాతాల్లో రూ.77.47 కోట్లు జమ కానుంది. 28వ తేదీ (బుధవారం) సీఎం వైఎస్ జగన్ కంప్యూటర్‌లో బటన్‌నొక్కి రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయనున్నారు. – సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

న్యూస్‌రీల్

మార్కెట్‌కు 2,320 క్వింటాళ్ల చింతపండు



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం 2,320 క్వింటాళ్ల చింతపండు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం (ప్రథమశ్రేణి) క్వింటా గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.8,500, సగటున రూ.10 వేల ప్రకారం పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.9,500, కనిష్టంగా రూ.4,150, సగటున రూ.36 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి. అలాగే బోటు రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.3,700, కనిష్టంగా రూ.2 వేలు, సగటు రూ.3 వేల ప్రకారం క్రయవిక్రయాలు సాగినట్లు మార్కెట్ కార్యదర్శి వెల్లడించారు.

నేటి నుంచి శనగ కొనుగోళ్లు



పుట్టపర్తి అర్బన్: రబీలో రైతులు సాగు చేసిన శనగలను రైతు భరోసా కేంద్రాల ద్వారా మంగళవారం నుంచి కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం క్వింటాకు రూ.5,440 మద్దతు ధర ప్రకటించిందన్నారు. శనగ సాగు చేసి.. ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు జాబ్‌మేళా

పుట్టపర్తి: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి అబ్దుల్ ఖయ్యూం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18–35 ఏళ్ల మధ్య వయస్సు ఉండి పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసివారు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు శ్రీసత్యసాయి జిల్లా, హైదరాబాద్‌లలో పని చేయాల్సి ఉంటుందన్నారు. వేతనం రూ.10 వేల నుంచి రూ.17 వేల వరకు ఉంటుందని వెల్లడించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

పోలీసుశాఖలో హోంగార్డుల పాత్ర కీలకం



హోంగార్డులకు సూచనలిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

కదిరి టౌన్: పోలీసు శాఖలో హోంగార్డుల పాత్ర కీలకమని రాయలసీమ రీజినల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం కదిరి సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డుల విజిటింగ్, పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన కమాండెంట్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ... క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విధుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అలాగే గతంలో చోటుచేసుకున్న పలు సంఘటనలను హోంగార్డులకు తెలియజేశారు. విధి నిర్వహణలో నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు ట్రాఫిక్ తదితర విధులపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రశేఖర్, సబ్ డివిజన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జ్, హోంగార్డులు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్‌లో చెలరేగిన మంటలు

ఎన్పీకుంట: స్థానిక సోలార్ పవర్ ప్రాజెక్టు అనుబంధ కంపెనీ మహేంద్ర పవర్ ప్రాజెక్టులోని ఓ బ్లాక్‌లో సోమవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. అగ్ని కీలలు పక్కనే ఉన్న గడ్డిపై పడటంతో మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పివేశారు. ఎంత మేర నష్టం వాటిల్లిందన్న విషయం విచారణలో తెలియాల్సి ఉంది.

పోలింగ్ కేంద్రాల్లో వసతులన్నీ ఉండాలి

- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



పరిగి మండలంలో పోలింగ్ కేంద్రాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, చిత్రంలో సబ్ కలెక్టర్

పెనుకొండ/రొద్దం/పరిగి: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులన్నీ కల్పించాలని, ఎక్కడైనా ఇంకా వసతుల కల్పన జరగకపోతే వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్‌తో కలసి పెనుకొండ మండలంలోని రాంపురం, వెంకటరెడ్డిపల్లి, ఇస్లాపురం, అడదాకులపల్లి, పరిగి మండలంలో పైడేటి, ధనాపురం, హొన్నంపల్లి, రొద్దం మండలంలోని సానిపల్లి, కలిపి, కె మరువపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ప్రధానంగా తాగునీరు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు ఉండాలన్నారు. అలాగే దివ్యాంగులకు ఇబ్బందులు కలగకుండా ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజున ఆయా కేంద్రాల్లో తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక అధికారులతో చర్చించారు. కలెక్టర్ వెంట ఆయా మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

డిప్యూటీ సీఈఓపై విచారణకు ఆదేశం

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ లలితబాయిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సీఈఓ గత ఏడాది జూన్, జూలై నెలల్లో డ్రా చేసిన వివిధ రకాల అలవెన్సులతో పాటు అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు కర్నూలు జిల్లా తుగ్గలి మండలం బొందిమడుగుకు చెందిన టీఎం రమేష్ అనే వ్యక్తి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు జెడ్పీ వర్గాలు తెలిపాయి. దీనిపై సమగ్ర విచారణ చేసి, నివేదిక ఇవ్వాల్సిందిగా అనంతపురం కలెక్టర్ గౌతమిని కమిషనర్ ఆదేశించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

- పబ్లిక్ ప్రదేశాల్లో మొబైల్ చార్జర్లు వాడరాదు
- ఆర్‌బీఐ ముద్రించిన పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

పుట్టపర్తి అర్బన్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ముఖ్యంగా బస్టాండు, రైల్వే స్టేషన్ తదితర పబ్లిక్ ప్రదేశాల్లో మొబైల్ చార్జింగ్ చేయకూడదన్నారు. దీనివల్ల సైబర్ నేరగాళ్లు డబ్బుతోపాటు వ్యక్తిగత సమాచారాన్ని సత్కరించే ప్రమాదం ఉందన్నారు. సోమవారం ఆయన అధికారులతో కలిసి సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించిన పోస్టర్లను కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సైబర్ నేరగాళ్లు రోజుకో విధంగా డబ్బు కాజేసే పద్ధతులు అవలంభిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సైబర్ స్మార్ట్ కావాలన్నారు. జీవితం ప్రారంభ దశ నుంచే ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఎల్‌డీఎం రమణకుమార్, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, గ్రామ/ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీహెచ్‌ఓ చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో సమస్యకు పరిష్కారం

- స్పందన అర్జీలపై అశ్రద్ధ పనికిరాదు
- ఎంపీడీఓలు 'ఉపాధి' పనులు పరిశీలించాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ''క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తే ఏ సమస్య అయినా పూర్తిగా తెలుస్తుంది. అప్పుడు శాశ్వత పరిష్కారం చూపే వీలు కలుగుతుంది. ఆ దిశగా అధికారులంతా చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా 'స్పందన', జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో అందిన అర్జీల పరిష్కారంపై ప్రతి అధికారీ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలి'' అని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో పాల్గొన్నారు. డీఆర్‌ఓ కొండయ్య, గ్రామ/వార్డు సచివాలయ నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 214 అర్జీలు అందగా, వాటి పరిష్కారం కోసం ఆయా శాఖలకు పంపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ....'స్పందన' సమస్యల పరిష్కారంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గడువులోపు పరిష్కరిస్తేనే లబ్ధిదారులు సంతృప్తి చెందుతారన్నారు. పరిష్కరించలేని వాటికీ సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

భవనాలను ప్రారంభించాలి..

నిర్మాణాలు పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను స్వాధీనం చేసుకుని త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అనుమతితో పండుగ వాతావరణంలో ప్రారంభోత్సవాలు చేపట్టాలన్నారు. జిల్లాలో 72 రైతు భరోసా కేంద్రాలు, 68 సచివాలయాలు, 46 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు కలిపి మొత్తంగా 188 భవనాల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. అలాగే ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా అందిన క్లెయిమ్‌లన్నీ మంగళవారంలోపు పరిష్కరించాలని ఆదేశించారు. ధర్మవరం డివిజన్‌లో క్లెయిమ్‌లు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇక ఉపాధి హామీ పనులను ప్రతి ఎంపీడీఓ తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అనంతరం రోజూ నివేదికలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, పట్టు పరిశ్రమ శాఖ అధికారి పద్మమ్మ, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు శివరంగప్రసాద్, మోహన్‌రాం, నిర్మలజ్యోతి, సీపీఓ విజయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని ఎక్సరే యూనిట్‌ను పరిశీలిస్తున్న కాయకల్ప బృందం సభ్యులు

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిని కాయకల్ప అవార్డు అసెస్‌మెంట్ బృందం డాక్టర్ సౌజన్య లక్ష్మి, నిరూప పటేల్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌తో కలిసి ఆస్పత్రిలోని ల్యాబ్‌లు, రక్తనిధి కేంద్రం, ఎక్సరే యూనిట్, డయాలసిస్ విభాగంతోపాటు పలు వార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ, ఐపీ సేవలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలపై ఆరా తీశారు. అలాగే రక్తనిధి కేంద్రం, రక్త పరీక్షల ల్యాబ్ తదితర వాటిలో పరికరాలను పరిశీలించి వైద్యులతో పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... జిల్లా ప్రభుత్వాస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఈ నివేదిక ఆధారంగా ఆస్పత్రి కాయకల్ప అవార్డు ఎంపికయ్యే అవకాశం ఉందని, తద్వారా నిధులు సమకూరే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ రుక్మిణమ్మ, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పురం, ధర్మవరం రైల్వే స్టేషన్లకు మహర్దశ





హిందూపురం రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, ధర్మవరం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన టీవీలో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగం

- 'అమృత్ భారత్' పథకం కింద అభివృద్ధి పనులు
- 'పురం' రైల్వే స్టేషన్‌కు రూ.15 కోట్లు
- ధర్మవరం స్టేషన్‌లో సౌకర్యాల కల్పనకు రూ.8.64 కోట్లు
- వర్చువల్‌గా పనులు ప్రారంభించిన ప్రధాని మోదీ

హిందూపురం అర్బన్/ధర్మవరం అర్బన్: జిల్లాలోని హిందూపురం, ధర్మవరం రైల్వే స్టేషన్లకు మహర్దశ పడుతోంది. 'అమృత్ భారత్' పథకానికి ఎంపికైన ఈరెండు రైల్వే స్టేషన్లలో ఆధునిక సౌకర్యాలు కల్పించనున్నారు. ఇందులో భాగంగా హిందూపురం రైల్వేస్టేషన్‌కు రూ.15 కోట్లు, ధర్మవరం స్టేషన్‌కు రూ.8.64 కోట్లను కేంద్రం కేటాయించింది. ఈ నిధులతో ఆయా స్టేషన్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులను సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. హిందూపురం రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో సౌత్ వెస్ట్రన్ రైల్వే సీనియర్ డీఈఎన్ రాజీవ్ శర్మ, రైల్వే బోర్డు మెంబర్ ఆదర్శకుమార్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, మున్సిపల్ చైర్ పర్సన్ ఇంద్రజ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ ముఖ్య నాయకులు పార్థసారథి, రమణమూర్తి, చలపతి, రైల్వే స్టేషన్ మేనేజర్ రామచంద్ర, సోమప్ప తదితరులు పాల్గొన్నారు. 'అమృత్ భారత్' నిధులతో హిందూపురం రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్, పార్కింగ్, ప్రయాణికుల విశ్రాంతి గది, ప్లాట్ ఫారాలపై పైకప్పు షీట్లు ఏర్పాటు చేయనున్నారు. హిందూపురంలో వందే భారత్ రైలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులను కోరగా... ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు..

'అమృత్ భారత్' పథకం కింద అందే నిధులతో ధర్మవరం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ధర్మవరం రైల్వే స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్‌కుమార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతిరావు, జాతీయ అవార్డు పొందిన తోలుబొమ్మలాట కళాకారుడు చిదంబర్‌రావు, ధర్మవరం రైల్వేస్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు, ఆర్‌పీఎఫ్ సీఐ బోయకుమార్, జీఆర్‌పీ సీఐ నాగరాజు, ఎస్‌ఐ గోపికుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రం ఇచ్చే నిధులతో ధర్మవరం రైల్వే స్టేషన్ భవనాన్ని ఆధునీకరించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

'అమృత్ భారత్'తో అభివృద్ధికి ముందడుగు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనగానపల్లి(చెన్నేకొత్తపల్లి): 'అమృత్ భారత్' పథకంతో రైల్వే అభివృద్ధికి ముందడుగు పడిందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. 'అమృత భారత్' పథకంలో భాగంగా సోమవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొత్త రైల్వే స్టేషన్లు, ఓవర్ బ్రిడ్జిలు, రైల్వే అండర్ పాస్‌లు నిర్మాణాలకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా చెన్నేకొత్తపల్లి సమీపంలో నిర్మించిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌తో పాటు ఎమ్మెల్సీ మంగమ్మ పలువురు రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ... భారతీయ రైల్వే రోజూ మూడు కోట్ల మంది ప్రయాణికులను గమ్య స్థానాలను చేరుస్తూ ప్రపంచంలోనే ఖ్యాతి పొందిందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న 'అమృత్ భారత్' వల్ల దేశంలో రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే ఓవర్ బ్రిడ్జ్‌లు, రైల్వే అండర్ పాస్ లైన్ల నిర్మాణాలూ జరుగుతాయన్నారు. అనంతరం రైల్వేశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ప్రజాప్రతినిధులు బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

నేడు ఉద్యోగుల స్పందన : డీఎంహెచ్ఓ

పుట్టపర్తి అర్బన్: ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ జె.శ్రీనివాస్ ఆదేశాల మేరకు మంగళవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉద్యోగుల జీతభత్యాల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ కార్యక్రమం ఉంటుంది.

డైట్ ప్రిన్సిపాల్‌గా రవిసాగర్



పుట్టపర్తి: బుక్కపట్నం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ నూతన ప్రిన్సిపాల్‌గా రవిసాగర్ నియమితులయ్యారు. ఏలూరు ఉప విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనను పదోన్నతిపై బుక్కపట్నం డైట్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ హోదాలో డైట్‌లో సీనియర్ వ్యాయామ అధ్యాపకుడు రామకృష్ణ కొనసాగుతూ వచ్చారు.

ఉన్నత విద్యలో సరికొత్త అధ్యాయం

- ఆన్‌లైన్ కోర్సుల సంస్థ ఎడెక్స్‌తో జగన్ సర్కార్ ఒప్పందం
- 2 వేలకు పైగా వరల్డ్ క్లాస్ కోర్సులు ఉచితంగా అందుబాటులోకి
- ఎస్కేయూ పరిధిలో 27 వేల మంది విద్యార్థులకు అవకాశం
- లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, ఎంటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీల నుంచి సర్టిఫికేషన్లు
- విద్యార్థికి వీలున్న సమయంలోనే కోర్సు పూర్తి చేసే వెసులుబాటు



ఎస్కేయూ పాలక భవనం

అనంతపురం: విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థులకు జగన్ సర్కార్ సువర్ణావకాశం కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను ఉచితంగా అందించే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో ఒప్పందం చేసుకుంది. దీంతో ఈ సువర్ణ అవకాశం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలలతో పాటు జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఎడెక్స్, ఉన్నత విద్యాశాఖ సంయుక్తంగా టీచింగ్, లెర్నింగ్ కోసం కొత్త టెక్నాలజీ, బోధన విధానాలను రూపకల్పన చేశాయి. హార్వర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, కొలంబియా, న్యూయార్క్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్, ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ వంటి ఎన్నో ప్రతిష్టాత్మక వర్సిటీల నుంచి వివిధ కోర్సుల్లో విద్యార్థులు సర్టిఫికేషన్లు సులువుగా పొందవచ్చు. ఈ కోర్సు పూర్తి చేయడం ద్వారా మంచి వేతనాలతో కూడిన జాతీయ, అంతర్జాతీయ ఉద్యోగాలను సాధించేందుకు దోహదం కానుంది.

27 వేల మందికి కోర్సు లబ్ధి..

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 27 వేల మంది విద్యార్థులకు ఎడెక్స్ లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే విద్యార్థుల వివరాలను ఉన్నత విద్యామండలికి అధికారులు నివేదించారు. వరల్డ్ క్లాస్ వర్సిటీలు, ఇతర విద్యా సంస్థలు అందించే రెండు వేలకు పైగా ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులతో పాటు ఉచితంగా అభ్యసించవచ్చు. అనంతరం ఎడెక్స్, అంతర్జాతీయ వర్సిటీల నుంచి సర్టిఫికెట్లు అందుకోవచ్చు. ప్రపంచంలోనే అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలు, సంస్థలకు చెందిన అత్యుత్తమ అధ్యాపకులతో బోధన లభిస్తుంది. శాస్త్ర, సాంకేతిక రంగాలతో పాటు సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన వివిధ సబ్జెక్టులను పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచితంగా అందుబాటులోకి తీసుకువచ్చారు.

నచ్చిన వర్టికల్స్ చదువుకునేలా...

ఎడెక్స్ కోర్సుల్లో ఎక్కువ వర్టికల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. తద్వారా విద్యార్థి నచ్చిన వర్టికల్స్ చదువుకునేలా ప్రణాళిక రూపొందించారు. విదేశాలకు వెళ్లి అక్కడ మేటి కళాశాలల్లో చదువుకోలేని ఎంతో మంది విద్యార్థులకు ఈ విధానం ద్వారా ఎంతో మేలు చేకూరనుంది. కరిక్యులమ్‌లో భాగంగా ఎడెక్స్ కోర్సులకు అంతర్జాతీయ వర్సిటీలే ఆన్‌లైన్‌లో ఎగ్జామ్స్ నిర్వహించి సర్టిఫికెట్లు అందిస్తాయి. తద్వారా ఏపీ విద్యార్థులు గ్లోబల్ స్టూడెంట్స్‌గా ఎదుగుతారు. ప్రొఫెషనల్, సంప్రదాయ డిగ్రీ విద్యలో లోటుపాట్లను సరిచేసి స్కిల్ ఓరియంటెడ్ కోర్సులను అందించడం ద్వారా నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధిలో ఎడెక్స్ ఎంతో ఉపయోగపడనుంది.

రూ.30 వేల విలువైన కోర్సు ఉచితంగా...

ప్రపంచంలోనే ప్రముఖ ఈ–లెర్నింగ్ ప్లాట్‌ఫాం వేదికగా ఉన్న ఎడెక్స్‌లో 180కి పైగా వరల్డ్‌క్లాస్ వర్సిటీలు రూపకల్పన చేసిన 2 వేల ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏ ఒక్క కోర్సు చేయాలన్నా కనీసం రూ.30 వేలు ఖర్చు భరించాల్సి ఉంది. అయితే ఈ కోర్సులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా అందిస్తోంది. ఇందుకోసం ఏడాదికి రూ.50 కోట్లు ఖర్చు చేస్తోంది. డిగ్రీ సెమిస్టర్‌లో ఆరు సబ్జెక్టులు ఉంటే ఒకటి ఎడెక్స్ కోర్సుతో భర్తీ చేస్తారు. అంతర్జాతీయ వర్సిటీలతో కలిసి విద్యార్థి అసైన్‌మెంట్స్, ప్రతిభ ఆధారంగా ఎడెక్స్ సంస్థ సర్టిఫికెట్ అందిస్తుంది. రాత పరీక్షను ఎడెక్స్ రూపొందించిన ప్రశ్నాపత్రంతో వర్సిటీలే నిర్వహిస్తాయి. క్రెడిట్స్‌ను కూడా వర్సిటీలే ఇస్తాయి. ఆసక్తి గల విద్యార్థులు ఒకటి కంటే ఎక్కువ కోర్సులు చేయవచ్చు. వాటిని వాల్యూ యాడెడ్ కోర్సులుగా పరిగణించి సర్టిఫికెట్ ఇస్తారు.

ఎడెక్స్ కోర్సు ఇలా...

డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులు తప్పనిసరిగా ఎడెక్స్ కోర్సులు అభ్యసించేలా కరిక్యులమ్‌లో ఓ భాగంగా మార్చేశారు. డిగ్రీ, పీజీ స్థాయిలో రెండు, నాలుగో సెమిస్టర్, ఇంజినీరింగ్ స్థాయిలో రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్‌లో ప్రతి విద్యార్థి వర్సిటీ లేదా కళాశాల ఎంపిక చేసిన ఎడెక్స్ కోర్సులను పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా ఎడెక్స్ అందించే అంతర్జాతీయ కోర్సులను అభ్యసించేందుకు అవకాశం ఉంది. ఈ ఆన్‌లైన్ కోర్సులను విద్యార్థులకు వీలున్న సమయంలో పూర్తి చేసే వెసులుబాటు ఉంది. వారానికి నాలుగు గంటల పాటు క్లాసులు ఉంటాయి. ప్రతి విద్యార్థి ప్రత్యేక లాగిన్ ద్వారా మొబైల్ యాప్‌లో పాఠాలు వినవచ్చు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఆన్‌లైన్ సపోర్టింగ్ సిస్టమ్‌లో మెంటార్లు అందుబాటులో ఉంటారు.

సువర్ణ అధ్యాయం



ఆంధ్రప్రదేశ్ ఉన్నత చదువుల చరిత్రలో ఇదోక సువర్ణ అధ్యాయం. ప్రపంచంతో పోటీ పడేలా మన విద్యార్థులు మెరుగైన ఉద్యోగాలు సాధించాలి. నాణ్యమైన విద్య ద్వారానే ఇది సాధ్యం. అందుకు విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉండాలి. అప్పుడే మన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు వస్తాయి. ఎడెక్స్ ప్రోగ్రాం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుంది. బయట రూ.35వేల నుంచి 40 వేలు వెచ్చించాల్సిన కోర్సులు ఉచితంగానే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

– ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి, వీసీ, ఎస్కేయూ

'పోలీస్ స్పందన'కు 27 వినతులు



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 27 వినతులు అందాయి. ఎస్పీ మాధవరెడ్డి స్వయంగా వినతులు స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడారు. స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, డీసీఆర్‌బీ సీఐ శ్రీహర్ష, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

29న పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

బత్తలపల్లి: స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానం వేదికగా ఉమ్మడి జిల్లా పురుషుల కబడ్డీ జట్టును ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్షుడు ఆర్.రాంతేజ్‌గౌడ్, కార్యదర్శి రాగిరి రామయ్య సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 85 కిలోలలోపు బరువున్న క్రీడాకారులు వెంట పదో తరగతి ఒరిజినల్ మార్కుల జాబితా, ఆధార్‌కార్డు ఒరిజినల్, మాట్ షూతో ఎంపిక ప్రక్రియకు హాజరు కావాలి. ఎంపికైన వారు మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కోవూరులో జరిగే రాష్ట్ర స్థాయి 70వ సీనియర్స్ పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారు.

అధిష్టానం ఆదేశిస్తే హిందూపురం నుంచి పోటీ

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

హిందూపురం అర్బన్: అధిష్టానం ఆదేశిస్తే హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ స్థానం నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తానని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం హిందూపురానికి విచ్చేసిన ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. 27 ఏళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం కార్యకర్తలా, నాయకుడిగా పనిచేస్తున్నాని గుర్తు చేశారు. ఓ స్థానికుడిగా హిందూపురం ఎంపీ బరిలో నిలిచేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. పార్టీ తరపున పరిపూర్ణానంద స్వామి ఇక్కడి నుంచి పోటీ చేస్తే తనకు ఎలాంటి అభ్యంతరమూ లేదన్నారు.

మూర్ఛ వ్యాధితో కూలీ మృతి

కదిరి అర్బన్: పని ప్రాంతంలో మూర్ఛ (ఫిట్స్) రావడంతో ఓ కూలీ మృతిచెందాడు. వివరాలు... ఓడీసీ మండలం వణుకవారిపల్లికి చెందిన రామకృష్ణయ్య (52) కూలి పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మల్లయ్యగారిపల్లి వద్ద ఆదివారం చెట్లు కోయడానికి వెళ్లాడు. పని ముగించుకుని రాత్రి తిరుగు ప్రయాణమైన ఆయన కదిరి మండలం గట్ల వద్దకు చేరుకోగానే బహిర్భూమికి వెళ్లి అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న భార్య రామకృష్ణమ్మ ఫిర్యాదు మేరకు కదిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మృతుడికి మూర్ఛ వ్యాధి ఉందని ఫిర్యాదులో భార్య పేర్కొంది. బహిర్భూమికి వెళ్లినప్పుడు మూర్ఛ రావడంతో మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల ప్రయోజనాలకు ప్రాధాన్యత

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 46 మంది అటెండర్లకు ల్యాబ్, రికార్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు

అనంతపురం సిటీ: ఉద్యోగుల ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పని చేస్తున్న 46 మంది అటెండర్లకు ల్యాబ్, రికార్డ్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారు. వీరికి అనంతపురంలోని జెడ్పీ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఉత్తర్వులను సోమవారం ఆమె అందజేసి, మాట్లాడారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్ల తరబడి పదోన్నతులు లేక పంచాయతీరాజ్ ఉద్యోగులు నలిగిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఫలితంగా అన్ని క్యాడర్ల వారికి పదోన్నతులు దక్కుతున్నాయన్నారు. తాజాగా ఒకేసారి 46 మందికి పదోన్నతులు కల్పిస్తూ, ఉత్తర్వులు అందజేయడం జెడ్పీ చరిత్రలోనే ఓ సువర్ణ అధ్యాయంగా నిలిచిపోతోందన్నారు. పదోన్నతులు పొందిన ఉద్యోగులు కూడా తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం పదోన్నతులు పొందిన ఉద్యోగులు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మతో కేక్ కట్ చేయించి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు చంద్రమోహన్, భూతరాజ్, పరిపాలనాధికారులు భాస్కర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, ధనుంజయ, 'ఏ' సెక్షన్ ఉద్యోగులు శిరీష, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించండి

- టీడీపీ, బీజేపీ మద్దతుదారులకు రెండేసి ఓట్లు
- ఆధారాలతో సహా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బత్తలపల్లి: మండలంలోని సంగాల గ్రామ పంచాయతీలో టీడీపీ, బీజేపీ మద్దతుదారులకు నియోజకవర్గంలోనే వేర్వేరు ప్రాంతాల్లో రెండు చొప్పున ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలంటూ ఆధారాలతో సహా తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌కు వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివశంకర్ నాయక్‌ను సంగాల సర్పంచ్ కంచనగారి రాజశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ కాటమరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, నాయకులు యలమకూరి సూర్యనారాయణరెడ్డి, మరూరు చెన్నారెడ్డి, నీరుగుట్టి పెద్ద రమణ, కె.హరినాథ్‌రెడ్డి తదితరులు కలిసి మాట్లాడారు. సంగాల గ్రామ పంచాయతీతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ టీడీపీ, బీజేపీ మద్దతుదారులు ఓట్లు కలిగి ఉన్నారన్నారు. ఈ విషయంగా గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఈ రెండు పార్టీల మద్దతుదారులతో పాటు ఇతరుల ఓట్లు కూడా రెండేసి ఉన్నాయని, వాటిని గుర్తించి తొలగించాలని విన్నవించారు. దొంగ ఓట్లు నమోదు చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ నేతలపై కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఫిర్యాదు చేయడాన్ని ఖండించారు. ఫిర్యాదు చేసిన 23 మంది డబుల్ ఎంట్రీలపై తహసీల్దార్ స్పందించారు. సంబంధిత బీఎల్ఓ గాయత్రికి జాబితాను అందజేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు లింగమయ్య, హరినాథ్, వెంగన్న తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

బ్రహ్మసముద్రం: వడదెబ్బ సోకి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లికి చెందిన హరిజన సన్నలింగప్ప (55) సోమవారం ఉదయం గ్రామ సమీపంలోని కప్పలకొండ చెరువులో కట్టెలు కొట్టేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఎండ తీవ్రతకు తాళలేక అక్కడే కుప్పకూలిపోయాడు. 3 గంటల సమయంలో అటుగా వెళ్లిన మేకల కాపర్లు గుర్తించి సమాచారం అందించడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని వెంటనే కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కాళ్లపై బొబ్బలు తేలి ఉన్నాయి. ఘటనపై బ్రహ్మసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

28న మెగా జాబ్ మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాదాపు 75 కంపెనీలతో అనంతపురంలోని ఎస్వీ డిగ్రీ కళాశాల వేదికగా ఈ నెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫౌండేషన్ అధ్యక్షుడు హరీష్‌కుమార్ యాదవ్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా, ఆటో మొబైల్, సెక్యూరిటీస్, మాన్యుఫాక్చరింగ్, ఇన్సూరెన్స్, హెల్త్ సెక్టార్, ఈ–కామర్స్ రంగంలోని దిగ్గజ కంపెనీలైన క్యాప్ జెమిని, వెబ్రోటెక్, ఎడ్యుబ్రిడ్జ్, బీట్సల్, సెవెంటెక్ టెక్నాలజీస్, కోజెంట్, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పేటియం, అమర్ రాజ, కియా మోటర్స్, అపోలో ఫార్మా, హెటిరో ఫార్మా, ముత్తూట్, ఎయిర్‌టెల్, టీవీఎస్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరు కానున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో ప్రతి పేద నిరుద్యోగికి అండగా ఉండటమే తమ లక్ష్యం అన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు కంపెనీల ప్రతినిధుల ద్వారా వెంటనే నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకూ వైభవంగా జరిగిన కొండమీదరాయుని బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ఉదయం తీర్థవాది వసంతోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై దేవేరులతో కలసి శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు.

జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు

హిందూపురం టౌన్: జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈ ఎన్నిక జరిగింది. తొలుత నిర్వహించిన అసోసియేషన్ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీమాంధ్ర డ్రగ్ డీలర్స్ అసోసియేషన్ కార్యదర్శి కరుణకుమార్ గుప్తా, మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రమేష్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న హాజరయ్యారు. ఎన్నికల అబ్జర్వర్లుగా శ్రీకాకుళం డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ కార్యదర్శి మణి రాజు, చిత్తూరు జిల్లా కెమిస్ట్ డ్రగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్ బాబు, శ్రీకాకుళం డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ కోశాధికారి మురళీకృష్ణ వ్యవహరించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా అనిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ షాప్ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హిందూపురం, ధర్మవరం, కదిరి, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని మెడికల్ షాప్ యజమానులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్స వికటించి ముగ్గురు మహిళల మృతి



రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబాల సభ్యులు

పావగడ: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఇటీవల వివిధ రోగాలకు శస్త్రచికిత్స పొందిన ముగ్గురు మహిళలు మృతిచెందారు. ఘటనపై బాధిత కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. వివరాలు... పావగడ తాలూకా వీర్లగొంది గ్రామానికి చెందిన అనిత(32) ఇటీవల పావగడలోని ప్రభుత్వాస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. అలాగే రాజవంతి గ్రామానికి చెందిన అంజలి(22) సిజేరిన్ శస్త్రచికిత్స, ఈ నెల 22న బ్యాడనూరు గ్రామానికి చెందిన నరసమ్మ (40) గర్భకోశ వ్యాధికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వీరి ఆరోగ్యం కుదుట పడకపోవడంతో మెరుగైన చికిత్స కోసం బెంగుళూరులోని వేర్వేరు ఆస్పత్రుల్లో కుటుంబసభ్యులు చేర్పించారు. చికిత్సకు స్పందించక రోజుల వ్యవధిలో ముగ్గురూ మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు సోమవారం మధ్యాహ్నం ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేపట్టారు. అకాల మృతికి కారణం పావగడ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులేనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుల్లో అంజలికి మూడేళ్ల వయసున్న కుమార్తెతో పాటు నాలుగు రోజుల వయసున్న మగ శిశువు ఉన్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామి సాయంత్రం ప్రభుత్వాస్పత్రి వద్దకు చేరుకుని బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి కారకులైన వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు.